సాక్షి
వికారాబాద్
బుధవారం। 24। మే। 2023



రోడ్డును తవ్వేశారు

రియల్టర్ల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. 30 ఏళ్ల నాటి ప్రభుత్వ రోడ్డును తవ్వేసి వెంచర్ ఏర్పాటు చేశారు. 8లో▸



ముగిసిన మహోత్సవాలు

కొటాలగూడెంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. 8లో▸



..ప్రోత్సాహం

ఉపాధి హామీ పథకం ద్వారా చేపల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా రైతులు ఫిష్ పాండ్స్ నిర్మిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

నవాబుపేట: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయొచ్చని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎల్లకొండలో స్థానిక సర్పంచ్ ఏర్పాటు చేసిన 56 సీసీ కెమెరాలను ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. నేరాల అదుపు, నిందితుల గుర్తింపులో ఇవి ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సర్పంచ్ వెంకట్‌రెడ్డిని అభినందిచారు. అన్ని గ్రామాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని, ఇందుకోసం ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ వెంకటేశం, ఎస్‌ఐ భరత్‌భూషన్, ఏఎస్‌ఐ మురళి, నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

నేడు కంది విత్తన మేళా

తాండూరు టౌన్: తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో బుధవారం కంది విత్తన మేళా నిర్వహించనున్నట్లు సెంటర్ ప్రతినిధి డాక్టర్ సుధారాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాండూరు పరిశోధన స్థానంలో రూపొందించిన తెలంగాణ కంది- 3 (టీడీఆర్‌జీ- 59), ఆశ (ఐసీపీఎల్- 87119) రకాల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. 4 కిలోల పరిమాణంలో ఉండే ఒక్కో ప్యాకెట్ ధర రూ.520 ఉంటుందని తెలిపారు. ఇవే కాకుండా పలు రకాల నూతన వంగడాలపై రైతులకు శాస్త్రవేత్తలతో అవగాహన కల్పిస్తామన్నారు. వరి, మొక్క జొన్న, ఆముదం, పెసర, మినుములు, స్వీట్ కార్న్, వానాకాలం జొన్న, పచ్చజొన్న, పశుగ్రాస పంట విత్తనాలు, జీవన ఎరువులు, పరాన్న సూక్ష్మజీవుల వంటివి కావాలంటే నేరుగా బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రధాన విత్తన మేళాకు వెళ్లాలని సూచించారు.

26న ఇంటర్వ్యూలు

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని బస్తీ దవాఖానాల్లో ఖాళీగా ఉన్న మూడు మెడికల్ ఆఫీసర్, డీఈఐసీలో పీడియాట్రిషన్ 1, సైకాలజిస్ట్ 1, ఆప్టోమెట్రిస్ట్ 1, డెంటల్ టెక్నీషియన్ 1 పోస్టులకు ఈనెల 26న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. అన్ని టెక్నికల్, అకాడమిక్ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో రావాలని సూచించారు.

ఈదురు గాలులతో నేలకూలిన స్తంభాలు



మారేపల్లి సమీపంలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

పెద్దేముల్: విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో మండల పరిధిలోని పలు గ్రామాలకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. మంగళవారం సాయంత్రం 4 నుంచి 5గంటల మధ్య బలమైన ఈదురు గాలులు వీచడంతో మారేపల్లి సమీపంలోని రెండు 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, మరో రెండు ఎల్టీ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో నాగులపల్లి, రుద్రారం, గోపాల్‌పూర్, తింసాన్‌పల్లి, నర్సాపూర్ గ్రామాలకు సరఫరా నిలిచిపోయింది. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నేల బాగా తడిసి ఉండటం, అప్పటికే స్తంభాలు కొంత నేలకు వంగి ఉన్నాయి. ఈ క్రమంలో ఈదురు గాలులకు పూర్తిగా నేలవాలాయి. విషయం తెలుసుకున్న లైన్‌మెన్ చందు విద్యుత్ పునరుద్ధరణ పనులు ప్రారంభించారు.

బంగారం పట్టివేత

శంషాబాద్: అక్రమంగా తీసుకొచ్చిన 1,818 గ్రాముల బంగారాన్ని శంషాబాద్ కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రియాద్ నుంచి మంగళవారం మధ్యాహ్నం ఎక్స్‌వై 325 విమానంలో వచ్చిన ముగ్గురు ప్రయాణికుల కదలికలను అనుమానించిన అధికారులు వారిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లగేజీల్లో ఎలాంటి వస్తువులు దొరకలేదు. వారు ధరించిన షూలను విప్పిచూడగా పాదం భాగంలో పేస్టు రూపంలో అతికించిన ఉన్న బంగారం బయటపడింది.

లక్ష్యం ఘనం.. సేకరణ దైన్యం

జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ లక్ష్యం ఘనం.. సేకరణ దైన్యం అనేలా మారింది. 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని టార్గెట్ పెట్టుకున్న అధికారులు ఇప్పటివరకు కేవలం 7వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యానికి ఇదే నిదర్శనమని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

- కల్లాల్లోనే మగ్గుతున్న ధాన్యం
- తేమ, తాలు పేరుతో మిల్లర్ల కొర్రీలు
- ఇష్టారాజ్యంగా తరుగు తీస్తున్న వైనం
- వేధిస్తున్న బార్దాన్, లారీల సమస్య
- నత్తనడకన కొనుగోళ్ల ప్రక్రియ



వికారాబాద్: ఓ పక్క కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల కొర్రీలు.. మరో పక్క వెంటాడుతున్న వరుణుడితో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. తేమ, తాలు పేరుతో ధాన్యాన్ని తిప్పి పంపిస్తుండటంతో చేసేదిలేక కల్లాల్లోనే ధాన్యం పెట్టుకుని పడిగాపులు కాస్తున్నారు. కొంతమంది చేసేది లేక తక్కువ ధరకు దళారులకు విక్రయిస్తుండగా.. మరికొందరు కొనుగోలు కేంద్రాలు, మిల్లర్ల షరతులకు తలొగ్గి ఎక్కువ తూకానికి వదిలేస్తున్నారు. ఇదిలా ఉండగా సమయానికి సంచులు ఇవ్వక.. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు లారీలు రాక అవస్థలు పడుతున్నారు. సర్పంచ్‌లు మొదలుకుని ఎమ్మెల్యే వరకు తమ సమస్యలను ఎవరికి చెప్పుకొన్నా.. ఫలితం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎవరు చెప్పినా మిలర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ససేమిరా అంటున్నారు. చివరికి తమ పంతమే నెగ్గించుకుంటూ రైతులను నిండా ముంచేస్తున్నారు. ఇక అధికారులు చుట్టపుచూపుగా వచ్చి వెళుతున్నారు.

93వేల ఎకరాల్లో సాగు

యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లావ్యాప్తంగా 93 వేల ఎకరాల్లో వరి సాగైంది. సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో స్థానికంగా జరిగే విక్రయాలు పోనూ 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం మొత్తం 126 సెంటర్లు చేసినా.. ఇప్పటి వరకు కేవలం 7వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. సగం కేంద్రాల్లో ఈరోజు వరకూ కొనుగోళ్లు ప్రారంభించలేదు. లక్ష్యంలో ఐదుశాతం కూడా కొనుగోలు చేయలేదు.

అంతా కుమ్మక్కు

ఏ గ్రేడ్ రకం క్వింటాలు ధాన్యానికి ప్రభుత్వం రూ.2,060, బీ గ్రేడ్ రకానికి రూ.2,040 మద్దతు ధర అందజేస్తోంది. 40కిలోల బరువుండే ధాన్యం బస్తాకు 1,200 గ్రాముల చొప్పున తరుగు తీయాలనే నిబంధనలు ఉన్నా.. ఎక్కడా సక్రమంగా అమలు కావడం లేదు. తూకం, తరుగు విషయంలో మిల్లర్లు అనేక షరతులు పెడుతున్నారు. కొనుగొలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులతో కుమ్మక్కై రైతులను ముంచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల బస్తాకు మూడు నుంచి ఐదు కిలోల తరగు తీస్తేనే ధాన్యం తీసుకుంటామని మిల్లర్లు తెగేసి చెబుతున్నారు.

అధైర్య పడొద్దు

ధాన్యం కొనుగోలు మందకొడిగానే కొనసాగుతోంది. నిబంధనల ప్రకారమే కొనుగోళ్లు నిర్వహిస్తున్నాం. మిల్లర్లు, సెంటర్ల నిర్వాహకులు కొర్రీలు పెడుతున్నారనడం వాస్తవం కాదు. మన ప్రాంతంలో కోతలు ఆలస్యంగా వచ్చాయి. చివరి గింజవరకూ కొనుగోళ్లు నిర్వహిస్తాం. ఎవరూ అధైర్య పడొద్దు.

– రాజేశ్వర్, డీఎస్‌ఓ, వికారాబాద్



మంత్రి హరీశ్‌రావు నిర్వహించిన వీసీలో పాల్గొన్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ తదితరులు

వారంలో పూర్తవ్వాలి

- ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి
- కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం
- అధికారులతో టెలీకాన్ఫరెన్స్

వికారాబాద్ అర్బన్: వారం రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని రైస్ మిల్లులకు ట్యాగింగ్ చేసి నిత్యం.. ఒక్కో మిల్లులో కనీసం 20 లారీల చొప్పున అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన స్టోరేజ్ సదుపాయం కూడా కల్పిస్తామని, మిల్లర్లకు నష్టం జరుగకుండా బ్రోకెన్ రైస్‌కు ప్రభుత్వం పరిహారం అందజేస్తుందని తెలిపారు. సహకరించని మిల్లులను సీజ్ చేసే అధికారం తహసీల్దార్లకు ఉందని స్పష్టంచేశారు. రవాణా కాంట్రాక్టర్లు కూడా ఎప్పటికప్పుడు అవసరమైన వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మిల్లర్ వద్ద హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేరకు గన్నీ బ్యాగులు అందించి.. ధాన్యం సేకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా అధికారులు, తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో ఉండి పనులను పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని, దళారులు, వ్యాపారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. ధాన్యం మొత్తం పూర్తయ్యే వరకు కొనుగోలు సెంటర్లు ఉంటాయన్నారు. సెంటర్ల వద్ద రైతులకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, మేనేజర్ విమల, డీఆర్‌డీఓ కృష్ణన్, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖపై మంత్రి సమీక్ష

జిల్లాకు మంజూరైన 36 సబ్ సెంటర్ల నిర్మాణ టెండర్ ప్రక్రియను ముగించి, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి పాల్గొని జిల్లాలో వైద్యారోగ్య శాఖ పనితీరు, ఆరోగ్య పథకాల అమలును వివరించారు. బాలింతలకు కేసీఆర్ కిట్లు, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ వివరాలను తెలియజేశారు. జిల్లాకు మంజూరైన 36 సబ్ సెంటర్ల నిర్మాణ పనులను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేస్తామని మంత్రికి వివరించారు.

గుండె.. ఆగుతోంది!



తాండూరు పట్టణానికి చెందిన అశోక్(45) ఫొటో గ్రాఫర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. గత నెల ఓ ఫంక్షన్ హాల్‌లో పెళ్లి ఫొటోలు తీస్తూ కుప్పకూలిపోయాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా.. గుండె పోటుతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన ఈడ్గి కృష్ణయ్య(48) బీఆర్‌ఎస్ పార్టీలో క్రియాశీల నాయకుడు. ఎలాంటి అనారోగ్య సమస్యలు లేని ఆయన ఇటీవల ఇంట్లో పనులు చేస్తూ అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించాడు.

- ఆందోళన కలిగిస్తోన్న హార్ట్ ఎటాక్ మరణాలు
- 35నుంచి 50 ఏళ్లలోపు వారే అధికం
- రోడ్డున పడుతున్న బాధిత కుటుంబాలు
- జిల్లా ఆస్పత్రిలో గుండె సంబంధిత చికిత్సలు శూన్యం
- పట్టించుకోని వైద్యారోగ్య శాఖ

తాండూరు: జిల్లాలో గుండెపోటు మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలా అకస్మాత్తుగా మృత్యువాత పడుతున్న వారిలో 35 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు వారే ఎక్కువగా ఉండటంతో బాధిత కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కూర్చున్న వారు కూర్చున్న చోటే ప్రాణాలు వదలడం కలచివేస్తోంది. గడిచిన మూడు నెలల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వందల మందికిపైగా హార్ట్‌ఎటాక్‌తో చనిపోయారని తెలుస్తోంది. మనిషి గుండె సాధారణంగా నిమిషానికి 60 నుంచి 100 సార్లు కొట్టుకోవాలి. కానీ కొందరిలో 250 సార్లు కొట్టుకుంటుండగా, మరికొందరిలో 60 కన్నా తక్కువ సార్లకు పడిపోతోంది. ఇలాంటి సందర్భాల్లో క్షణాల్లోనే ప్రాణాలు కోల్పోతున్నారు.

పరిగణనలోకి తీసుకోని వైద్యశాఖ

జిల్లాలో గుండెపోటు మరణాలు పెరుగుతున్నా వైద్యారోగ్య శాఖ పెద్దగా దృష్టిసారించడం లేదు. దీనికి తోడు వీటిని సహజ మరణాలుగా పరిగణిస్తున్నారు. ఆకస్మిక గుండెపోట్లకు కరోనా వైరస్ కూడా కారణం కావచ్చని ప్రజలు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా కోవిడ్ వ్యాక్సిన్ వేసుకున్న వారిలో రక్తం గడ్డ కట్టి గుండెపోటు వస్తోందనే వదంతులూ ఉన్నాయి. వీటిపై స్పష్టత ఇస్తూ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన వైద్యారోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

రిఫర్ టు హైదరాబాద్

జిల్లాలో గుండె సంబంధిత వైద్య సేవలు అందని ద్రాక్షగానే మిగిలాయి. హార్ట్‌ఎటాక్‌కు గురైన వారిని జిల్లా ఆస్పత్రికి తరలిస్తే సదరు స్పెషలిస్టులు లేక నగరానికి రిఫర్ చేస్తున్నారు. ఈ క్రమంలో కొంతమంది మార్గమధ్యంలోనే మరణిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఆస్పత్రికి కార్డియాలజిస్టును కేటాయించాలని కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో గుండెపోటు మరణాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాం. ఇందులో భాగంగా కార్డియాక్ నిపుణులతో శిబిరాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేపట్టాం. వైద్యారోగ్య శాఖ తరఫున గుండెపోటు మరణాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– పాల్వన్‌కుమార్, డీఎంహెచ్‌ఓ

సివిల్స్‌లో మెరిసిన షాద్‌నగర్ ఆణిముత్యం

జాతీయ స్థాయిలో 384వ ర్యాంకు సాధించిన సుస్మిత



ఇప్పలపల్లి సుస్మిత

షాద్‌నగర్: దేశంలోనే అత్యున్నత సర్వీస్‌గా భావించే సివిల్ సర్వీసెస్ పరీక్షా ఫలితాల్లో జాతీయ స్థాయిలో షాద్‌నగర్ విద్యార్థిని సత్తా చాటింది. పట్టణానికి చెందిన ఇప్పలపల్లి శ్రీశైలం, లక్ష్మి దంపతుల కూతురు సుష్మిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 384 ర్యాంకు సాధించింది. గతంలో మూడుసార్లు ఇంటర్వ్యూకు చేరుకున్న ఆమె లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. పట్టువదలకుండా నాలుగోసారి శ్రమించి మంచి ర్యాంకు సాధించింది. ఆమె పదో తరగతి వరకు షాద్‌నగర్ పట్టణంలోని హెరిటేజ్ వ్యాలీలో చదివింది. అనంతరం హైదరాబాద్‌లోని పేజ్ కళాశాలలో ఇంటర్, అండర్ గ్రాడ్యుయేషన్‌ను వరంగల్‌లోలోని నిట్‌లో పూర్తి చేసింది. పబ్లిక్ సర్వీస్‌పై ఆసక్తి పెంచుకున్న ఆమె సివిల్స్‌కు సిద్ధమైంది. నాలుగో ప్రయత్నంలో లక్ష్యాన్ని చేరుకుంది.

రోడ్ల పక్కన పెంట కుప్పలేంటి?

- గ్రామాల పరిశుభ్రత బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే
- అలసత్వం చేస్తే చర్యలు తప్పవు
- జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్



మంబాపూర్‌లో రోడ్డు పక్కన ఉన్న పెంట కుప్పలను పరిశీలిస్తున్న డీపీఓ తరుణ్‌కుమార్

పెద్దేముల్: ప్రధాన రహదారుల పక్కన వేసిన పెంట కుప్పలను వెంటనే తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ ఆదేశించారు. స్పెషల్ శానిటైజేషన్ డ్రైవ్‌లో భాగంగా మంబాపూర్ గ్రామ పంచాయతీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత ఉండాలని.. పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తాండూరు- హైదరాబాద్ మెయిన్ రోడ్డు పక్కన వేసిన పెంట కుప్పలను, ప్లాస్టిక్ కాగితాలను పరిశీలించి, వెంటనే తొలగించాలని ఎంపీఓ షేక్ సుష్మాకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలకు తెలిపారు. వర్షం నీరు వృథాకాకుండా ఇంటింటికీ ఇంకుడు గుంత నిర్మించుకునేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని స్పష్టంచేశారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాలు, వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. లేదంటే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చెత్తాచెదారాన్ని ఇష్టారాజ్యంగా పడేయొద్దని, మురుగు గుంతలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం తట్టెపల్లి, ఓంలానాయక్‌తండా, జైరాతండా(తట్టెపల్లి) తదితర గ్రామాల్లో పర్యటించారు. తట్టెపల్లిలో మురుగు కాల్వలు సక్రమంగా లేవని, మురుగు నీరు ప్రధాన రహదారుల పక్కన చేరుతోందని అసహనం వ్యక్తంచేశారు. సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓను ఆదేశించారు. గ్రామాలు స్వచ్ఛంగా లేకపోతే సదరు పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంకుడు గుంతల ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని సూచించారు.

కార్యదర్శిపై చర్యలేవీ..?

ఫోర్జరీ సంతకాలతో మంబాపూర్ పంచాయతీకి సంబంధించిన రూ.10.20 లక్షల నిధులను దుర్వినియోగం చేసిన పంచాయతీ కార్యదర్శి ఇమ్రొద్దీన్‌పై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని సర్పంచ్ శ్రావణ్‌కుమార్ డీపీఓ దృష్టికి తీసుకెళ్లారు. స్వచ్ఛ భారత్ మరుగుదొడ్ల నిధుల దుర్వినియోగం జరిగి ఆరు నెలలు దాటినా ఎలాంటి విచారణ చేపట్టలేదన్నారు. సంబంధిత అధికారులు, పోలీసులు స్పందించి పంచాయతీ నిధుల రికవరీకి కృషి చేయాలని కోరారు. ఈ విషయమై డీపీఓ మాట్లాడుతూ.. జీపీ నిధులను దుర్వినియోగం చేసిన కార్యదర్శిపై తప్పకుండా చర్యలు ఉంటాయని తెలిపారు.

మళ్లీ ఇళ్ల స్థలాలు

- 2014 ముందు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పట్టాల జారీ
- అప్పట్లో పట్టాలిచ్చి.. పొజిషన్ చూపని ప్రభుత్వం
- కొన్నిచోట్ల పొజిషన్ చూపినా కట్టుకోని లబ్ధిదారులు
- ఆయా భూములు స్వాధీనం
- తిరిగి కేటాయింపులకు సన్నాహాలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పేదలకు మళ్లీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగానికి ఇప్పటికే మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. దీంతో రెవెన్యూ అధికారులు ఆయా భూములను గుర్తించి, వాటిలో లేఅవుట్ తయారు చేసి.. పాత లబ్ధిదారులతో పాటు కొత్తగా మరికొంత మందికి కేటాయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తొలుత మహేశ్వరంలో ఈ ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయించారు.

అప్పట్లో వందల మందికి కేటాయింపు

2014కు ముందు ఉమ్మడి ఏపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాలు కేటాయించింది. మహేశ్వరం మండలంలోని మీర్‌పేట్, కందుకూరు, కడ్తాల్‌తో పాటు చేవెళ్ల నియోజకవర్గంలోని అజీజ్‌నగర్, తోల్‌కట్ట, శంకర్‌పల్లిలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని వినోబానగర్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, కుంట్లూరు, బాటసింగారం, మునుగనూరు, వట్టినాగులపల్లి తదితర ప్రాంతాల్లోనూ ప్రభుత్వ, అసైన్డ్ భూములను పేదలకు పంచారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని సుల్తాన్‌పల్లి, దావుద్‌గూడ.. ఇలా జిల్లా వ్యాప్తంగా 3,500 నుంచి 4000 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేసినట్లు సమాచారం. ఈ స్థలాలు ఊరికి దూరంగా ఉండటం, ఎత్తుపల్లాల మధ్య ఉండటం, కరెంట్, రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పట్టాలు పొందిన లబ్ధిదారుల్లో చాలా మంది ఇల్లు నిర్మించుకోలేకపోయారు. ఒకటి రెండు గదులు నిర్మించిన వారు కూడా ఆ తర్వాత అక్కడ కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఆయా గదుల్లో ఉండలేక పోయారు.

ఒకే పని రెండు రకాలుగా లబ్ధి

పట్టాలు ఇచ్చిన తర్వాత ఆరు నెలల్లోనే పొజిషన్‌కు వెళ్లాలనే నిబంధన కూడా విధించారు. నిర్మాణ ఖర్చులకు డబ్బులు లేకపోవడం వారి పాలిట శాపంగా మారింది. ఇటీవల వీరిలో కొంత మంది ఆయా పట్టాలు తీసుకుని తమకు కేటాయించిన సర్వే నంబర్లలో ఇల్లు నిర్మించుకునేందుకు యత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అదేమంటే ఆరు నెలల్లోపే పొజిషన్‌లోకి వచ్చిన వారి పట్టాలు మాత్రమే చెల్లుబాటవుతాయని ప్రకటించారు. పోలీసు బందోబస్తు మధ్య ఆయా నిర్మాణాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారు. పొజిషన్‌లో ఉన్న వారిని వదిలేసి.. లేనిచోట ఆయా ఖాళీ స్థలాల్లో మళ్లీ కొత్తగా లే అవుట్ చేసి, చేతిలో పట్టా కాగితాలున్న పాత లబ్ధిదారులతో పాటు కొత్త లబ్ధిదారులకు కేటాయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇళ్ల స్థలాలు పంచడం ద్వారా పేదలకు లబ్ధి చేకూర్చడంతో పాటు మరో ఆరు నెలల్లో రాబోతున్న ఎన్నికల్లోనూ ఓట్ల రూపంలో లబ్ధిపొందొచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

58,59 జీవోల కింద భారీగా దరఖాస్తులు

ఒకవైపు పాత పట్టా దారులకు పొజిషన్ చూపించాలని సన్నాహాలు చేస్తూ.. మరోవైపు ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారి నివాసాలను, వారి ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ఏర్పాట్లు చేసింది. గత ఆగస్టులో జీఓ నంబర్ 58,59లను జారీ చేసింది. తొలుత 2014 జూన్ 2గా ఉన్న కటాఫ్ డేట్‌ను 2020 జూన్ వరకు పొడిగించి మళ్లీ అవకాశం కల్పించింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ రెండు జీఓల కింద 50 వేలకుపైగా దరఖాస్తులు అందాయి. ఈ నెలాఖరుతో దరఖాస్తు గడువు ముగియనుండటంతో మరిన్ని దరఖాస్తులు అందే అవకాశం లేకపోలేదు. ఇదిలా ఉంటే జిల్లా పరిధిలోని యూఎల్‌సీ భూముల్లోని 44 కాలనీల్లోని ఇళ్ల క్రమబద్ధీకరణకు 118 జీఓను జారీ చేసింది. ఈ జీఓ కింద ఇప్పటికే ఐదు వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 900 దరఖాస్తులు మినహా మిగిలిన వాటికి ఇప్పటికే పట్టాలు జారీ చేసింది. 58,59 జీవోల కింద ఇప్పటి వరకు ఐదు వేల ఇళ్లను క్రమబద్ధీకరించారు. దరఖాస్తుల పరిశీలన ఇంకా కొనసాగుతోంది. ఈ పథకంతో ఆక్రమణదారులకు లబ్ధి చేకూరడంతో పాటు ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశం లేకపోలేదు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అధికారుల నిర్లక్ష్యమే కారణమని మృతుడి భార్య ఆరోపణ


బిచ్చయ్య మృతదేహం

పరిగి: విద్యుదాఘాతానికి ఒకరు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మాదారంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్ రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన షాబాద్ బిచ్చయ్య (48) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్ సిబ్బంది కనెక్షన్‌ను తొలగించారు. అయితే ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చే విద్యుత్ తీగకు సపోర్ట్ తీగ ఇంటి వెనుకల గల స్తంభం వద్ద వేలాడుతూ ఉంది. ఉదయం వేలాడుతున్న తీగను తీసివేద్దామని బిచ్చయ్య యత్నించగా విద్యుదాఘతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతి చెందాడని మృతుని భార్య యాదమ్మ ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య


సతీశ్ (ఫైల్)

తాండూరు టౌన్ : ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన మంగళవారం రాత్రి తాండూరు పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని చెంగోల్ బస్తీకి చెందిన మాణెమ్మకు సతీశ్ (35), రవికుమార్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. గతంలో సతీశ్ మొబైల్ దుకాణం నడిపేవారు. రెండేళ్ల క్రితం దుకాణం మూతపడటంతో కొద్ది రోజులుగా కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. ఇతనికి భార్య పిల్లలు ఉన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ప్రారంభం కావడంతో మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య, పిల్లలు వేరే దగ్గర నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి సతీశ్ రక్తపు మడుగులో పడి ఉండటాన్ని సమీప బంధువు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. స్థానికులు చికిత్స నిమిత్తం అతన్ని తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. కాగా సతీష్‌కు, అతని సొంత తమ్ముడు రవికుమార్ మధ్య డబ్బుల విషయంలో గొడవ జరిగిందని సమాచారం. ఈ క్రమంలోనే తమ్ముడే ఈ దారుణానికి పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


ఎరువుల దుకాణంలో పోలీసుల తనిఖీ

నవాబుపేట: ఫెర్టిలైజర్ షాపుల్లో నకిలీవిత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ భరత్‌భూషన్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని పులుమామిడి, నవాబుపేట మండల కేంద్రంలోని ఆరు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన మందులను, ఎరువులనే విక్రయించాలన్నారు. కొనుగోలు దారులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. ఎక్కడైనా నకిలీవిత్తనాలు, ఎరువులు విక్రయించినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఏఎస్ఐ మురళీ, సిబ్బంది ఉన్నారు.

రోడ్డును తవ్వేశారు


రియల్టర్లు తవ్విన పంచాయతీరాజ్ రోడ్డు

రియల్టర్ల బరితెగింపు

- 30 ఏళ్ల నాటి మెటల్‌రోడ్డు మాయం
- ఫాంల్యాండ్ ముసుగులో వెంచర్
- అనుమతులు లేకున్నా చేపడుతున్న పనులు
- నాయకులకు, అధికారులకు రూ.లక్షల్లో ముడుపులు
- పనులు అడ్డుకోవాలంటూ స్థానికుల డిమాండ్

పరిగి: రియల్టర్ల ఆగడాలకు అడ్డూఅదుపులేకుండా పోతోంది. యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు. 30 ఏళ్ల నాటి ప్రభుత్వ రోడ్డును సైతం తవ్వేసి వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. మండల పరిధిలోని నారాయణపూర్ రెవెన్యూ పరిధిలోకి వచ్చే పంచాయతీరాజ్ రోడ్డును కొంత మంది రియల్టర్లు తవ్వేశారు. దోమ మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు నుంచి నారాయణపూర్ గ్రామానికి రెండు కిలోమీటర్ల మెటల్ రోడ్డు ఉంది. తమ వెంచర్‌కు రోడ్డు అడ్డుగా ఉందని భావించి తొలగించారు.

అనుమతులు లేకుండానే పనులు.

నారాయణపూర్ రెవెన్యూ పరిధిలోకి వచ్చే సర్వే నంబర్ 234, 233 లో కొంత మంది 18 ఎకరాల వ్యవసాయ భూమికి కొనుగోలు చేశారు. ఆ భూమిలో ఒక వైపు నారాయణపూర్ గ్రామానికి వెళ్లేందుకు పంచాయతీ రాజ్ మెటల్ రోడ్డు ఉంది. గతంలో మండల పరిషత్, జిల్లా పరిషత్, ప్రధానమంత్రి సడక్ యోజన కింద మూడు దఫాలుగా గ్రామానికి మెటల్ రోడ్డును వేశారు. ప్రధాన రోడ్డుకు పక్కన రియల్టర్లు కొనుగోలు చేసిన భూమి సర్వేనంబర్ 234లో 15 ఎకరాలు, సర్వేనంబర్ 233లో 3 ఎకరాలు ఉంది. మధ్యలో రోడ్డు ఉండటంతో తొలగించారు. ఇందుకు అధికారులకు ప్రజాప్రతినిధులకకు భారీ మొత్తంలో ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందుకే ఇంత జరుగుతున్నా ఎవరూ నోరుమెదపడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఫాంల్యాండ్ ముసుగులో వెంచర్ ఏర్పాటుకు పనులు చేపడుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని వారు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అక్రమంగా చేపడుతున్న వెంచర్ పనులను అడ్డుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

రూ.లక్షల్లో ముడుపులు

రియల్టర్లకు అధికార పార్టీ నాయకుల అండదండలు, ప్రతిపక్ష నేతల మద్దతు సైతం ఉండటం వల్లే రోడ్డును అడ్డంగా తవ్వేశారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారపార్టీ, ప్రతిపక్ష నాయకులకు రూ.లక్షల్లో ముడుపులు ముట్టచెప్పారని వారు అంటున్నారు. పంచాయతీ రాజ్ అధికారులకు సైతం మామూళ్లు అందడం వల్లే అక్రమార్కులు చేపడుతున్న పనులు సాఫీగా జరుగుతున్నాయని గ్రామస్తులు మండిపడుతున్నారు. రియల్టర్లు చేస్తున్న అక్రమాలను కొంతమంది గ్రామస్తులు అడ్డుకోవడంతో బెదిరించినట్లు సమాచారం.


అనుమతులు లేకుండానే వెంచర్ పనులు

అధికారుల అండదండలు



వెంచర్‌కు అడ్డుగా ఉందని పంచాయతీరాజ్ రోడ్డును తొలగించిన రియల్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారపార్టీ నాయకుల అండదండలతో రియల్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కబ్జా కళ్లకు కనిపిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. రియల్టర్లపై చర్యలు తీసుకోకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపడతాం.

– కోళ్ల యాదయ్య, వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్

చర్యలు తీసుకుంటాం



పంచాయతీ రాజ్ రోడ్డును తవ్వడం నేరం. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రోడ్డును తవ్వితే చర్యలు చేపడతాం. అయితే రోడ్డును తవ్వినట్లు మాదృష్టికి రాలేదు. విచారణ చేపట్టి నిజమని తేలితే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– సుదర్శన్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ పరిగి

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్

మర్పల్లి: రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, వికారాబాద్ నియోజకవర్గంలో పార్టీ విజయఢంకా మోగించడం ఖాయమని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో 30 మంది ముఖ్య నాయకులతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కమిటీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే పలు గ్రామాలలో కమిటీలు వేశామన్నారు. వికారాబాద్ నియోజక వర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్ బరిలో ఉంటారన్నారు. ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా చంద్రశేఖర్ ఎనలేని సేవలు అందించారని ఆయన గుర్తు చేశారు. బీజేపీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బన్నే మల్లేశ్‌యాదవ్, పార్టీ ఇన్‌చార్జీ శ్రీనివాస్ నాయకులు ఉన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్

వైభవంగా ముగిసిన ప్రతిష్ఠాపన మహోత్సవాలు


కొటాలగూడెంలో బోనాలు


పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

- చివరి రోజు ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణ
- పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీమంత్రి, జిల్లా అధికారులు

అనంతగిరి: వికారాబాద్ మండలం కొటాలగూడెంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న జగదాంబమాత, సంత్ సేవాలాల్ మహరాజ్‌ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. చివరి రోజు గ్రామస్తులు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామాన్ని చల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని, సంత్‌సేవాలాల్ మహరాజ్ విగ్రహాలను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ దంపతులతో పాటు మాజీమంత్రి చంద్రశేఖర్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా ఎస్టీ అభివృద్ధి శాఖ అధికారి కోటాజీ, జిల్లా కోశాధికారి దశరథ్, జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, ఎంపీడీఓ సత్తయ్యతో పాటు పలువురు అధికారులు దర్శించుకున్నారు. ఉత్సవాల్లో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, దాతలు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో పనులు పూర్తి చేయండి

వికారాబాద్ అర్బన్: గ్రామాల్లో మరో రెండు రోజుల్లో అసంపూర్తిగా ఉన్న పారిశుద్ధ్య పనులు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం పలు అభివృద్ధి పనులపై ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. మిగిలిన అసంపూర్తి పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా నడుపుతునందుకు జిల్లా వైద్య అధికారులను కలెక్టర్ అభినందించారు. జూన్ 10 నాటితో కంటి వెలుగు కార్యక్రమం పూర్తి కానునందున కంటి అద్దాలు అందరికీ అందించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ అశోక్ కుమార్, డీఆర్‌డీఓ కృష్ణన్, జెడ్పీ సీఈఓ జానకీ రెడ్డి, డీపీఓ తరుణ్ కుమార్, డీఈఓ రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రైతులకు ఇబ్బందులు తలెత్తవద్దు


రైస్ మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

- సరిపడా గన్నీ బ్యాగులు అందించండి
- కొనుగోళ్ల కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్ : రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని రైస్ మిల్లర్ల యాజమాన్యాలకు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాలలోని రైస్ మిల్లర్ల యజమానులు, అధికారుల సమావేశంలో పలు సూచనలు చేశారు. రైతులకు గన్నీ బ్యాగులు అందించేలా, సమయానుకూలంగా కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తూ రైతులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించేలా కృషిచేయాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల పీఏసీఎస్ చైర్మన్లు కటుకం శివకుమార్‌గుప్త, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు రామునాయక్, బస్వరాజ్, గోడల రాంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భీములు, దామోదర్‌రెడ్డి, పర్సాపూర్ సర్పంచు సయ్యద్ అంజద్ తదితరులు పాల్గొన్నారు.

గోవు మెడకు తాడు బిగించి.. మట్టుబెట్టారు

మంబాపూర్‌లో ఘటన


మృతి చెందిన గోవు వద్ద రోదిస్తున్న బాధితురాలు

పెద్దేముల్: గోవు మెడకు తాడు బిగించి మట్టుబెట్టిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంబాపూర్ గ్రామానికి చెందిన గిడ్డ శ్రీనివాస్ గోవును ఖరీదు చేసి పోషిస్తున్నారు. బంధువుల వద్ద వివాహానికి హాజరయ్యేందుకు ఇతరుల పొలంలో మేతకు వదిలి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆవు మెడకు తాడును బిగించి చంపేశారు. సాయంత్రం వేళ రైతులు గమనించి శ్రీనివాస్‌కు సమచారం అందించారు. ఘటనా స్థలానికి బాధిత కుటుంబ సభ్యులు చేరుకుని బోరున విలపించారు. గోవు మెడకు తాడును బిగించి మట్టుబెట్టారని బాధితుడు వాపోయారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు

పెద్దేముల్: ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు క్షీరాభిషేకం చేశారు. జేపీఎస్‌ల సర్వీసు క్రమబద్ధీకరణకు నిర్ణయం తీసుకోవడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట వివిధ గ్రామాల జేపీఎస్‌లు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల కార్యదర్శుల రాజు, శ్రావణ్, రమేశ్, ఆనంద్, చంద్రశేఖర్, యశ్వంత్, అరుణ, అర్చన, హేమలత తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


క్రీడలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

పరిగి: యువత చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సీఎం కప్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే క్రీడల్లో రాణించడం ద్వారా భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. యువత క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా క్రీడలను నిర్వహిస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకటరామయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు నాగేశ్వర్, రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర


జాతరలో గిరిజన యువతుల సందడి

బొంరాస్‌పేట: 'జై.. సేవాలాల్ మహరాజ్ .. మారెమ్మ మాతాకీ.. జైజై'.. అంటూ మండల పరిధిలోని బొట్లోనితండాలో సేవాలాల్ మహరాజ్ మారెమ్మ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం హోమం, పూజా కార్యక్రమాలు, పల్లకిసేవా, బోనాల ఊరేగింపు కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు నెహ్రూనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వివాహ వేడుక


రాములు దంపతులకు శుభాకాంక్షలు చెబుతున్న స్థానికులు

తాండూరు: పట్టణంలోని సాయిపూర్ ప్రాంతానికి చెందిన వ్యాపారవేత్త రాములు 25వ వివాహ వేడుక, అలాగే అవ్వ తాతల షష్టిపూర్తి మహోత్సవాన్ని కుటుంబ సభ్యులు ప్రణయ్‌కుమార్, పవన్ కుమార్, పవిత్ర ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని గంగోత్రి పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు, వ్యాపారులు, బంధువులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఎస్ఐ


పోలీస్ వాహనంలో బాధితుడిని తరలిస్తున్న పోలీసులు

నవాబుపేట: ఎస్ఐ భరత్‌భూషన్ మానవత్వం చాటారు. ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడటంతో గాయపడిన వాహనదారుడిని తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి. కోహీర్ మండలం ఖానాపూర్ కు చెందిన అశోక్ నవాబుపేట మండలం పులుమామిడి గ్రామానికి చెందిన బంధువు అంత్యక్రియలకు బైక్ పై వస్తున్నాడు. పులుమామిడి పరిసరాల్లో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. తీవ్ర గాయాలు కావడంతో అటుగా వెలుతున్న ఎస్ఐ స్పందించి తన వాహనంలోనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అశోక్‌కు బలమైన గాయాలు కాకపోవడంతో వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి పిలిపించారు.

ధాన్యం తరలింపులో సమస్యలు రానివ్వం

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

పరిగి: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని సుల్తాన్‌పూర్, రంగంపల్లి గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యం కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ధాన్యాన్ని బాగా ఆరబెట్టి తీసుకురావాలని సూచించారు. రైతులు ఆందోళన చెందవద్దని ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి ప్రభాకర్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.


సుల్తాన్‌పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్